క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిటౌన్: విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా పట్టణ, రూరల్ గ్రామాల్లో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని కోరారు.

శ్రీ విరాట్ విశ్వకర్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట

తెనాలిటౌన్: పట్టణ టి.బి.రోడ్డులోని శ్రీ విరాట్ విశ్వకర్మ దేవస్థానంలో శుక్రవారం గణపతి, నవగ్రహ, కుమారస్వామి, నందీశ్వర, శివ, కామాక్షి, దాసాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. ఆరికట్ల గోవర్ధనశాస్త్రి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లీశ్వరి, వేద పాఠశాల చైర్మన్ నూతలపాటి సురేష్ దంపతులు, వేద పాఠశాల విద్యార్థులు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు అంగలకుదురులో ఉచిత మెడికల్ క్యాంప్

తెనాలిటౌన్: రూరల్ మండలం అంగలకుదురు గ్రామంలోని గోవాడ పరంధామయ్య కమ్యూనిటీ హాల్‌లో 'వి' కార్డియాక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. మెడికల్ క్యాంప్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉంటుందన్నారు. రోగులకు ఉచితంగా ఈసీజీ, థైరాయిడ్, సుగర్, రక్త పరీక్షలు చేస్తారని చెప్పారు. శిబిరంలో డాక్టర్ కె.సాంబశివరావు, డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ విజయవాణి, డాక్టర్ కె.సురేష్, డాక్టర్ తాజుద్దీన్‌లు వైద్యపరీక్షలు చేస్తారని తెలిపారు. గ్రామంలోని ప్రజలు వైద్య సేవలను ఉపయోగించుకోవాలని వారు కోరారు.

బాలిక అదృశ్యం

తెనాలిరూరల్: బాలిక అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం పెదరావూరుకు చెందిన 14 ఏళ్ల బాలిక ఖ్యాతి కుసుమ శివ ఈ నెల 6వ తేదీన తెనాలి నాజరుపేటలోని స్నేహితురాలి వద్దకు వెళ్లింది. కొద్దిసేపు స్నేహితురాలి వద్ద గడిపి తిరిగి అక్కడే ఆటో ఎక్కింది. ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ ఎం. ఉమామహేశ్వరరావు శుక్రవారం రాత్రి తెలిపారు.

11న తెనాలి ఐటీఐలో అప్రెంటీస్ మేళా

తెనాలిఅర్బన్: తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో అప్రెంటీస్ మేళాను ఈ నెల 11న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రావి చినవెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో 15 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతోపాటు పాస్‌పోర్ట్ ఫొటోలతో ఉదయం 10 గంటలకు ఐటీఐ కళాశాలలో జరిగే మేళాలో హాజరు కావాలని కోరారు. వివరాలకు సెల్ నెంబర్ 9959828100 లో సంప్రదించాలన్నారు.

ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పి.బుజ్జిబాబు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు సభ్య దేశాలలో ప్రపంచ అక్షరాస్యతా వేడుకలు, అక్షరాస్యత ప్రాధాన్యత, ఆర్థికాభివృద్ధికి, సమతుల్యమైన ఆహార జీవన విధానం అవలంభించేందుకు, వ్యక్తిగా, సమిష్టిగా కుటుంబ బాధ్యతలు నిర్వర్తించుటకు, విలువలతో కూడిన జీవన విధానం అవలంబించేందుకు అక్షరాస్యులు గొప్పగా వెలుగొందుతారని అన్నారు. అనంతరం 40 మంది ఇంటర్ విద్యార్థులకు సుమారు రూ.31 వేలతో యూనిఫాం అందజేశారు. ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు పెన్నులు, టిఫిన్ బాక్సులు అందజేశారు. శ్రీరామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, టి.ఆనందరావు, డి.శ్రీనివాసరావు, ఎం.సుందరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ప్రత్తిపాడు: రహస్యంగా పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను వట్టిచెరుకూరు పోలీసులు అరెస్టు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం .. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడులోని ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న సమాచారం స్పెషల్ బ్రాంచి పోలీసులకు అందింది. దీంతో ఎస్ఐ కోటేశ్వరావు, సిబ్బంది కలిసి జూద స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 17,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇస్కాన్ మందిరంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి



అన్నదానం చేస్తున్న మందిరం నిర్వాహకులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

తెనాలిటౌన్: పట్టణ నాజర్‌పేటలోని ఇస్కాన్ మందిరంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు,పూజలు చేశారు. మందిరం నిర్వాహకులు సింహగౌరిదాస్ అన్న ప్రసాద వితరణను ప్రారంభించారు. గోపినాథ్ ప్రియదాస్ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వీరిశెట్టి శివ నాగమల్లేశ్వరి, భాస్కర్, వాడపల్లి రాము, హనుమ, మేకల అప్పారావు, చిరంజీవి, తన్నీరు భరత్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి భరోసా

కొల్లిపర: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు అధికారిణి రాజకుమారి సూచించారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో డ్వాక్రా యానిమేటర్లకు, ప్రకృతి వ్యవసాయ ఇంటర్నల్ రిసోర్స్ పర్సన్‌లకు రెండవ రోజు ప్రకృతి వ్యవసాయంలోని 2016 నుంచి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ న్యాచురల్ వ్యవసాయం దానిలో మహిళా సంఘాల పాత్ర గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చీడపీడల నుంచి పంటలను కాపాడటానికి సేంద్రియ సిబ్బంది తయారు చేసిన కషాయాలను వినియోగించాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ న్యాచురల్ వ్యవసాయం ఆవశ్యకత, సార్వత్రిక సూత్రాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు అధికారిణి రాజకుమారి

ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ జిల్లా ప్రాజెక్టు అధికారిణి జానకి , డీఎల్ఎంటీ సత్యనారాయణ, మండల్ ఎస్ఎఫ్ఏ నాగలక్ష్మి, ఏపీఎం ప్రియదర్శిని, వెలుగు సీసీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

చిన్నారి నృత్యకళాకారిణులకు సత్కారం

తెనాలి: ఇటీవల కర్ణాటక, హరియాణ రాష్ట్రాల గవర్నర్ల సత్కారం అందుకున్న తెనాలికి చెందిన చిన్నారి నృత్యకళాకారిణులు గ్రీష్మశ్రీ, తహసీన్‌లను శుక్రవారం సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అభినందించారు. స్థానిక రత్న ఫార్చ్యూన్ కళ్యాణమండపంలో ఏర్పాటైన సభకు సినీదర్శకుడు, మా-ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. తెనాలికి చెందిన ఎందరో చిన్నారులు, యువతులు శాస్త్రీయ నృత్యం , ఇతర సంప్రదాయ కళలకు జీవం పోస్తుండటం సంతోషకరమని చైర్‌పర్సన్ ఖలేదా అన్నారు. చిన్న వయసులోనే రెండు రాష్ట్రాల గవర్నర్‌ల ఎదుట తమ నృత్య కౌశలాన్ని ప్రదర్శించిన చిన్నారులు భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తన వంతుగా ఇద్దరు చిన్నారులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు బహుమతిగా



చిన్నారులను సత్కరించి నగదు బహుమతిని అందజేసిన ఖలేదా నసీమ్

అందజేశారు. వీరికి నృత్యశిక్షణ ఇస్తున్న నృత్యగురువు నిర్మలా రమేష్, చిన్నారుల తల్లిదండ్రులు శెవ్వా కృష్ణారెడ్డి,అరుణకుమారి, షేక్ రఫీ,ఆలియ దంపతులను కూడా సత్కరించారు. మా-ఏపీ సంయుక్త కార్యదర్శి మిలటరీ ప్రసాద్, వర్ధమాన నటుడు అమీర్‌చౌదరి, దర్శకుడు శ్రీనివాసయాదవ్, పినపాటి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు గరికపాటి రాజారావు

తాడేపల్లిరూరల్: సుప్రసిద్ధ ప్రజా కళాకారుడు, రంగస్థల సినీ నటుడు, దర్శకుడు, ప్రజానాట్యమండలి నిర్మాతల్లో ఒకరు అయిన డాక్టర్ గరికపాటి రాజారావు 60వ వర్ధంతిని ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు కంచర్ల కాశయ్య, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ప్రజానాట్యమండలి కళాకారులు, అభ్యుదయవాదులు, కళాకారులు, కవులు, సీపీఐ నాయకులు విచ్చేసి గరికపాటి రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇప్టా జాతీయ కార్యదర్శి గని మాట్లాడుతూ గరికపాటి రాజారావు ప్రజానాట్యమండలి సాంఘిక నాటకాలకు పెద్ద పీట వేశారని, నాటక సంఘం ద్వారా అనేకమంది ప్రతిభావంతమైన కళాకారులు పరిచయమయ్యారని వీరిలో దేవిక, అల్లు రామలింగయ్య, సంగీత దర్శకులు మోహన్ దాస్, టి.చలపతిరావు, నృత్య దర్శకుడు వేణుగోపాల్, రచయితలు సుంకర సత్యనారా



డాక్టర్ గరికపాటి రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

యణ, వాసిరెడ్డి భాస్కరరావు, బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ ఉన్నారని అన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా నాయకుడు కంచర్ల కాశయ్య మాట్లాడారు. గుంటక సాంబిరెడ్డి, తుడిమెల్ల వెంకటయ్య, చిన్న సత్యనారాయణ, గంజి వెంకయ్య, బొర్రా శ్రీనివాసరావు, శీలం శ్యామ్, శీలం అనిల్, హనోక్, దొంత కోటేశ్వరరావు, సందుపట్ల భూపతి, రేఖా కృష్ణార్జున బోధి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్, విజిలెన్స్ అధికారుల తనిఖీలు

అదనపు లోడు వాడుతున్న102 మందికి రూ.6.2 లక్షల జరిమానా

రాయపూడి(తాడికొండ): తుళ్ళూరు మండలం మందడం విద్యుత్ సెక్షన్‌లో విద్యుత్, విద్యుత్, విద్యుత్ విజిలెన్స్ విభాగం అధికారులు ఇంటింటికీ తనిఖీలు నిర్వహించారు. 9 గ్రామాల పరిధిలో నిర్వహించిన ఈ తనిఖీలలో మొత్తం 3200 సర్వీసులను తనిఖీలు నిర్వహించగా అనుమతి లేకుండా అదనపు లోడు వాడుకుంటున్న 102 మంది వినియోగదారుల నుంచి రూ.6.2 లక్షల జరిమానా విధించినట్లు విజిలెన్స్ విభాగం ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. సీఆర్డీయే ఎస్ఈ పి.విజయ్



వివరాలు వెల్లడిస్తున్న నిఘా విభాగం ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి

కుమార్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఈఈ మల్లిఖార్జున్, అమరావతి డివిజన్ ఈఈ టీవీ తులసీ రామ్, ఏడీఈలు, ఏఈలు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వీఐటీ- ఏపీలో ఫ్రెషర్స్‌కు ఓరియంటేషన్ సదస్సు

ఐనవోలు(తాడికొండ): నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువులో ఏకాగ్రత, పట్టుదలతో ముందుకెళితే సాధించలేనిది ఏదీ లేదని వీఐటీ-ఏపీ అలూమ్ని అసోసియేషన్ చైర్మన్ మాతలఫి అన్నారు. శుక్రవారం పాఠశాలలో నూతనంగా విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫ్రెషర్స్‌కు ఓరియంటేషన్ సదస్సులు నిర్వహించడం ద్వారా విశ్వ విద్యాలయ, సంస్కృతి, సాంప్రదాయాలు, ఇతర వసతులు, వనరులపై అవగాహన కల్పించవచ్చన్నారు. కళాశాలలో విద్యార్థుల మానసిక వికాసం కోసం చదువుతో పాటు విజయానికి అవసరమైన కౌన్సెలింగ్ సెంటర్‌లు, ఎడ్యుకేషనల్, కెరీర్ డెవలప్‌మెంట్ సేవలు, పాఠ్యేతర కార్యకలాపాలు, క్లబ్‌లు, పరిశోధనా అవకాశాలు, ఇంటర్న్‌షిప్ మరియు విదేశీ విద్యపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నూతన విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. వీఐటీ-ఏపీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి, అకడమిక్స్ డీన్ డాక్టర్ ఎస్.మధుసూధనరావు, డిపూటీ డైరెక్టర్ డాక్టర్ డి.జాన్ ప్రదీప్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీఐటీ-ఏపీ అలూమ్ని అసోసియేషన్ చైర్మన్ మాతలఫి

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో వృద్ధుడు మరణించిన ఘటన నారాకోడూరు వద్ద శుక్రవారం జరిగింది. నారాకోడూరు గుండవరం రోడ్డులోని గాయత్రీ శక్తి పీఠానికి చెందిన కసుకర్రు వీరయ్య(80) స్థానిక కెనరా బ్యాంక్ సమీపంలో జరిగిన గాయత్రీ హోమం ముగించుకొని ద్విచక్ర వాహనంపై శ్యామలాంబతో కలిసి బయలు దేరారు. జీబీసీ రహదారి మీదకు వచ్చే సమయంలో గుంటూరు వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన ఇద్దరిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గ్రంథాలయానికి సాహిత్య పుస్తకాలు అందజేత

తెనాలిఅర్బన్: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకులు లయన్ కాకరపర్తి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో తెనాలి శాఖా గ్రంథాలయానికి సాహిత్య పుస్తకాలను శుక్రవారం ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కావూరి రమాదేవి, క్లబ్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి రాజ్‌కుమార్, సభ్యులు అయినాల మల్లేశ్వరరావు, కొణిజేటి రమేష్‌కృష్ణ, జవ్వాజి శ్రీనివాసరావు, పాదర్తి వెంకటేశ్వరరావు, నంబూరు శ్రీకుమార్, వెచ్చా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

జీఈఆర్ నివేదికను బహిర్గతం చేయాలి

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖచే సెప్టెంబరు 4వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 'గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో' (జీఈఆర్) నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి బాధ్యత తీసుకుని శ్వేతపత్రం విడుదల చేయాలని చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలిలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల కోసమే తాము పోరాడుతున్నామని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

వేర్వేరు ఇళ్లల్లో చోరీలు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి పెదవడ్లపూడిలోని వేర్వేరు నివాస గృహాల్లో చోరీలు జరిగాయి. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదవడ్లపూడికి చెందిన గడ్డిపాటి రమేష్ బాబు బత్తివూడి నరసింహారావులకు చెందిన నివాస గృహాల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. రమేష్ బాబు నివాసంలో 2 గ్రాముల బంగారు వస్తువులతో పాటు రూ. 20వేల నగదును దోచుకున్న దుండగులు నరసింహారావు నివాసంలో పూజా సామగ్రిని చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలపై రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలు

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానం ముఖ మండపంపై శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఆవరణలోని రాజ్యలక్ష్మి అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

మహిళకు టిఫిన్ బండి అందజేత

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లిలో నివసిస్తున్న పేద మహిళకు మంగళగిరి తాడేపల్లి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆర్థిక సహాయంతో టిఫిన్ బండిని శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడేపల్లి బైపాస్‌రోడ్‌లో నివసించే దమ్మర లక్ష్మీదేవి టిఫిన్ బండి పెట్టుకుని జీవనం కొనసాగిస్తోంది. టిఫిన్ బండికి అద్దెలు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని పట్టణ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన తన సొంత ఖర్చులతో టిఫిన్ బండిని తయారు చేయించి అందజేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మేకా అంజిరెడ్డి, కల్యాణ్, బాబూరావు, దర్శి రమేష్, మోదుగుల కృష్ణారెడ్డి, సత్యాల రంగస్వామి పాల్గొన్నారు.

దుర్గగుడి ఆహ్వాన సంఘ సభ్యుడిగా జేపీ



తాడేపల్లిరూరల్ : విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి యున్న దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ప్రత్యేక ఆహ్వాన సభ్యుడిగా తాడేపల్లికి చెందిన జెక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (జె.పి.) ని నియమిస్తూ దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయగా, దేవస్థానం ఈఓ భ్రమరాంబ చేతుల మీదుగా శుక్రవారం ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, దేవదాయ ధర్మాదాయ శాఖా మాత్యులు కొట్టు సత్యనారాయణలు తనపై నమ్మకం ఉంచి శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ప్రత్యేక ఆహ్వాన సభ్యుడిగా నియమించారని, వారు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెనాలి చిత్రకారిణికి అనుపోజు జయశ్రీ పురస్కారం

నేడు హైదరాబాద్‌లో ప్రదానం

తెనాలి: చిత్రకళలో తెనాలి ఘనతకు వారసురాలిగా స్త్రీలపై వేధింపులు, లైంగిక దాడులు ఇతివృత్తాలుగా చిత్రకళా రచన చేస్తూ, దేశంలోనూ వివిధ దేశాల్లోనూ చిత్రకళా ప్రదర్శనల్లో పాల్గొంటున్న విశ్రాంత చిత్రకళా ఉపాధ్యాయిని ఆమ్రపాలి మరో గౌరవాన్ని అందుకోనున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం సాయంత్రం జరిగే ప్రత్యేక సభలో అనుపోజు జయశ్రీ స్మారక చిత్రకళా పురస్కారాన్ని స్వీకరించనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో జీవీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2023 పురస్కారాలను హైదరాబాద్ చిత్రకారుడు శేషబ్రహ్మం, తెనాలి చిత్రకారిణి ఆమ్రపాలికి ప్రదానం చేస్తారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, సినీనటుడు మురళీమోహన్, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరి



కృష్ణ తదితర ప్రముఖులు పాల్గొంటారు. కమ్యూనిస్టు కుటుంబ నేపథ్యం కలిగిన పార్వతి చిత్రాల్లో సామాజిక చిత్రణ ప్రధానంగా కనిపిస్తుంది. ఈమె భర్త జుగాష్ విలి కవి, పాత్రికేయుడు. ఆయిల్ కలర్స్ మీడియంలో ఆమె వేసిన చిత్రాలు జాతీయస్థాయిలో ఢిల్లీ, నాగపూర్, చెన్నై, ముంబయి, హైదరాబాద్, విజయవాడ, అమరావతి, గుంటూరులో జరిగిన చిత్రకళా ఎగ్జిబిషన్లలో ప్రదర్శించారు. అంతర్జాతీయస్థాయిలో బ్యాంకాక్, వియత్నాం, ఈజిప్టులోని కైరో, చైనాలోని బీజింగ్ అలాగే జాతీయంగా సిక్కింలోని గ్యాంగ్‌టక్‌లోని చిత్రకళా ప్రదర్శనల్లో ఆమె చిత్రించిన బొమ్మలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. ఆయా దేశాల్లోని ఎంబసీ అధికారులతో సత్కారాలనూ అందుకున్నారు. కాంబోడియా, మలేషియా, ఇండోనేసియా, బాలి ఐలాండ్ ప్రాంతాలను సందర్శించారు. ఎన్‌సీఈఆర్‌టీ ప్రచురించిన ప్రభుత్వ పాఠ్యపుస్తకాలకు బొమ్మలు వేశారు. కొందరు ప్రముఖుల కవితా సంపుటాలకు ముఖచిత్ర రచన చేశారు. చిత్రకళతోపాటు శిల్పకళలోనూ ప్రవేశముంది. మెటల్‌ను పోలినట్టుండే ఫైబర్‌తో వీరు చేసిన చిత్రాలు ఆకర్షిస్తాయి. 'బతుకు చిత్రం' పేరుతో లఘుచిత్రం తీశారు. ప్రస్తుతం పూర్తికాలం చిత్ర, శిల్పకళలో కృషిచేస్తున్నారు. ఆసక్తి కలిగినవారికి చిత్రకళలో శిక్షణ ఇస్తున్నారు. తన కృషికిగాను గతంలో ప్రతిష్టాత్మక ఉమ్మడిశెట్టి సత్యాదేవి పురస్కారంతో సహా పలు అవార్డులను అందుకున్నారు.

ఆమ్రపాలి పేరుతో చిత్రకళా రచన చేస్తున్న చిత్రకారిణి కొతరపు పార్వతి. స్థానిక తాలూకా హైస్కూలులో చదువుతూ, పదోతరగతి తర్వాత ప్రఖ్యాత చిత్రకారుడు ఆదెళ్ల హనుమంతరావు దగ్గర శిక్షణ పొందారు. ఆయన సూచనపై డ్రాయింగ్‌లో హయ్యర్ టీటీసీ చేశారు. మైసూరు యూనివర్సిటీలో బీఎఫ్ఏ చదివారు. విజయవాడలోని రాజస్థానీ విద్యాలయంలో కొంతకాలం హిందీ మీడియంలో చిత్రలేఖనం బోధించారు. తర్వాత గుంటూరు హిందూ కాలేజి హైస్కూలులో డ్రాయింగ్ టీచరుగా ఉద్యోగంలో చేరారు. 2008లో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పొందారు. 2017లో రిటైరయ్యారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: తట్టుకుళ్ళ వాసవి అమెరికా వెళ్తున్న సందర్భంగా ఆమె తండ్రి వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌యాదవ్ శివాజీచౌక్‌లోని కాళీమాత దేవస్థానం ఆవరణలో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ ప్రతినిధి గుమ్మడి రమేష్ మాట్లాడుతూ ప్రతి నెల రెండవ శుక్రవారం దాతల సహకారంతో దేవస్థానం వద్ద అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, శానంపూడి రఘురామిరెడ్డి, అవ్వారు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు వై.శ్రీనివాసరావు, మెడికల్ సుబ్బారావు, నక్కా వెంకటేశ్వర్లు, అడపా నాగేశ్వరరావు, డాకా అంజిరెడ్డి, వై.శివాజీ, పాల్గొన్నారు.



మురుగు కాల్వలో చెత్తను వేయవద్దు

తెనాలిఅర్బన్: షాపుల్లో ఉత్పత్తి అయిన చెత్తను, ఇతర వ్యర్థాలను మురుగు కాల్వల్లో వేయవద్దని మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ కోరారు. బోసురోడ్డు నుంచి చిట్టి ఆంజనేయస్వామి గుడి వరకు ఉన్న కల్వర్ట్‌లను శుక్రవారం మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. కల్వర్టులో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వల్లో సీసాలు, కొబ్బరి బొండాలు, టైరులు, ట్యూబ్‌లు, కవర్లు, అట్టపెట్టెలు వేయడం వలన పారుదల నిలిచిపోతుందన్నారు. వ్యాపారులందరూ ప్రతి రోజు చెత్తసేకరణకు వచ్చే సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీ శ్రావణ్, సురేష్ తదితరులు ఉన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.విజయసారథి

మంగళగిరి: ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎంవీఐ వి.విజయసారధి అన్నారు. ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డు భద్రతా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంవీఐ మాట్లాడుతూ జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన ఎంతో అవసరమన్నారు. లైసెన్స్ లేకుండా ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేయడం వల్ల వారికే కాకుండా ఇతరులకు కూడా ప్రమాదకరంగా మారుతున్నారన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ షేక్ అబ్దుల్ రెహ్మాన్, జాతీయ సేవా పథకం అధికారి రేఖా నరేష్, ఆర్.నరసింహ నాయక్ పాల్గొన్నారు.



ఆటలతో ఆరోగ్యం, భవిష్యత్తు

తాడేపల్లిరూరల్: ప్రతి విద్యార్థి విద్యతో పాటు ఆటల్లో కూడా రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అన్నారు. శుక్రవారం దుగ్గిరాల మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆటల పోటీలను రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ, జడ్పీటీసీలు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తోందని, చదువుతో పాటు పాఠశాలలో ఆటల పోటీలు కూడా నిర్వహించి ప్రతిభ గల విద్యార్థులను ఎంపిక చేసి నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపిక చేస్తున్నారని, దానిలో భాగంగానే మన మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని వారు అన్నారు. మండలంలోని ఏడు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జడ్పీటీసీ అరుణ

జిల్లా పరిషత్, 3 మండల పరిషత్ పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు ఈ క్రీడల పోటీలకు హాజరయ్యారని, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంఈఓ-2 కె.లక్ష్మీ నారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ కొప్పుల ప్రకాశరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.ఆంథోని రాజు, సర్పంచ్ పలుకూరి మేరమ్మ, వైస్ ప్రెసిడెంట్ మోదు దుర్గ, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.